క్లుప్తంగా

సత్యనారాయణ గుప్తా మృతి పార్టీకి తీరనిలోటు



గుప్తా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భోగి సత్యనారాయణ గుప్తా మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కొనియాడారు. బుధవారం సాయంత్రం సత్యనారాయణ గుప్తా మరణించిన విషయం తెలుసుకున్న ఆయన.. గుప్తా భౌతికకాయాన్ని గురువారం సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కోరారు.

వితరణ



స్కూల్ బ్యాగులతో చిన్నారులు

బొబ్బిలిరూరల్: మండలంలోని రామన్నవలస గిరిజన గ్రామంలోని చిన్నారులకు మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణదాస్ సౌజన్యంతో స్కూల్ బ్యాగులు, దుస్తులు గురువారం వితరణ చేశారు. మానవతావాదులంతా సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని, తమకు కలిగిన దానిలో కొంతభాగాన్ని లేని వారికి సాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గోవింద, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే..



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమేనని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో మానసిక ఆరోగ్యంపై గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానసికంగా బాగుండడం కోసం ప్రయత్నించాలన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మనోవిజ్ఞానవేత్తలు, మానసిక వైద్య నిపుణులను సంప్రదించి, వారి సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి గేదెల శశిభూషణరావు, వైద్యుడు రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. 2002–03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రేగిడి: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు సూచించారు. మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని, పాము, తేలుకాటు నివారణ మందులు కూడా ఉంచాలని వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరిలకు సూచించారు. ఆస్పత్రిలో ఇంటర్నెట్ సదుపాయం, వసతులపై చర్చించి, అవసరమైన వస్తుసామగ్రి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ 'ధర'హాసం!

- దసరా వేళ కొండెక్కిన పొట్టేలు, నాటుకోడి ధరలు
- మార్కెట్‌లు, సంతల్లో జోరుగా క్రయవిక్రయాలు
- కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్న జనం



రాజాం వారపుసంతలో గొర్రెపోతుల క్రయవిక్రయాలు



అమ్మకానికి సిద్ధం చేసిన నాటుకోళ్లు

రాజాం: దసరా పండగ వచ్చిందంటే చాలు మనందరికీ ముఖ్యంగా గుర్తొచ్చేది ఆయుధ పూజ. ఇంట్లో ఫ్యాన్‌ల దగ్గర నుంచి వాహనాల వరకు ప్రతీ ఇనుము వస్తువుకూ రంగురంగుల జెండాలు అతికించి, దుర్గాదేవికి బలిచ్చిన కోడి, పొట్టేలు రక్తపుచుక్కలు చల్లి, పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో గొర్రెలు(పొట్టేలు), నాటుకోళ్ల విక్రయాలు జోరందుకున్నాయి. మరో రెండు రోజుల్లో పండగ కావడంతో మార్కెట్‌లు, సంతలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. రాజాం పట్టణంలో గురువారం జరిగిన వారపు సంతకు కొనుగోలుదారులు, విక్రయదారులు పోటెత్తారు. ప్రధానంగా నాటుకోళ్లు, గొర్రెల విక్రయాలు అధికంగా కనిపించాయి. అధిక ధరకు అవి అమ్ముడుపోతుండడంతో పెంపకందారులు, విక్రయదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండెక్కిన కోడి ధర..

గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభించే నాటుకోడి.. ఇప్పుడు కొనాలంటే గగనమవుతోంది. దసరా పండగ రోజున వాహన పూజల్లో వీటిని విరివిగా వినియోగిస్తుండడంతో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. కిలో బరువు తూగే కోడిపుంజు ధర రూ.800 పైమాటే పలుకుతుండగా, కోడిపెట్ట ధర రూ.500 పలుకుతోంది. అయినా కొనుగోలుకే జనం మొగ్గు చూపడంతో హాట్ కేకుల్లా అవి అమ్ముడుపోయాయి. ప్రస్తుతం నాటుకోడి ధర బాగా పెరగడంతో వాటిని పెంచేవారు పండగ కలసివచ్చిందని సంబరపడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాటుకోడి ధరలు విపరీతంగా పెరిగాయి. వాహనం ఉన్న ప్రతిఒక్కరితో పాటు ప్రతీ ఇంటి వారు పూజలు, మాంసాహారం కోసం వాటిని కొనుగోలు చేసేందుకే ఆసక్తి చూపిస్తుండడం విశేషం.

పొట్టేలు ధర రూ.15 వేల పైనే..

రాజాం వారపు సంతలో అయితే అధికంగా మేకపోతులు, గొర్రెల విక్రయాలు జరిగాయి. వాటి ధర కూడా చాలా ఎక్కువగా ఉంది. 12 కిలోలు పైబడి ఉన్న గొర్రె, మేకపోతుల ధర రూ.15 వేల వరకూ పలుకుతోంది. మార్కెట్‌లో కిలో గొర్రె మాంసం ధర రూ.వెయ్యి ఉండడంతో ప్రస్తుతం పండగ సందర్భంగా వాటి ధరలు కొండెక్కాయి. ఎంతైనా పండగ ఒక్కరోజే కదా అని కొనుగోలుకు ప్రజలు ఏమాత్రం వెనుకడుగు వేయకపోవడం విశేషం.

రూ.15 వేల లోపు ఏదీ లేదు..

గతంలో దసరా, సంక్రాంతి సమయాలలో గొర్రెలు, మేకపోతులు వారపు సంతలో రూ.10 వేలకే దొరికేవి. ఇప్పుడు రూ.15 వేల లోపు ఏదీ దొరకడం లేదు. ఇప్పుడు నిత్యవసర సరుకుల ధరలతో పాటు అన్ని ధరలు విపరీతంగా పెరిగాయి.
–ఎస్.చిన్నయ్య, వన్నలి, రేగిడి మండలం

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో సురేష్ అండ్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత, విద్యార్థులు చెడు అలవాట్ల బారినపడి బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. బాగా చదువుకున్న వారు.. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకుని, స్థిరపడ్డారని వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, వంజరాపు కృష్ణమూర్తి, కోచ్ అప్పలబాబా తదితరులు పాల్గొన్నారు.

అంబకండిలో 'పొలం పిలుస్తోంది'



అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో జి.మురళీకృష్ణ తొలుత పంటలు, వాటికి సోకే తెగుళ్లు, చీడపీడలు వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, ఏదైనా పంటకు తెగులు సోకిన వెంటనే తగిన మందు పిచికారీ చేయాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



రైతుసేవా కేంద్రాల సిబ్బందికి సూచనలిస్తున్న ఏవో శ్యామ్‌సుందర్

బొబ్బిలిరూరల్: వ్యవసాయ సిబ్బంది అంతా రైతులకు అందుబాటులో ఉండాలని ఏవో శ్యామ్‌సుందర్ సూచించారు. స్థానిక డివిజన్ కేంద్రంలోని కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం, బాడంగి మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు వరినాట్లు వేసిన నాటి నుంచి ధాన్యం అమ్మకాల వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ వారికి అండగా నిలవాలన్నారు. ప్రతినెలా జీతం తీసుకుంటున్నది వారికి సేవలందించేందుకేనన్నారు. అనంతరం శిక్షణా తరగతుల్లో భాగంగా ఈ–క్రాప్ నమోదు, పంటల్లో సస్యరక్షణ చర్యలు, పంట కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఏఎల్ ఎం.సూరినాయుడు, బాడంగి, తెర్లాం, రామభద్రపురం ఏవోలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గ్రామ సందర్శన'



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎస్‌కే రాజు అన్నారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామాన్ని గురువారం సందర్శించిన వారు అక్కడి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి, సిబ్బంది పనితీరు, అక్కడి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామ సందర్శన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

- జిల్లా పరిషత్ సీఈవో వీవీ సత్యనారాయణ



శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సీఈవో సత్యనారాయణ



బాడంగి: మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బొబ్బిలిరూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ సీఈవో వీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు గురువారం హాజరైన ఆయన, శిక్షణార్థులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలని, వారు నిధుల మంజూరుకు కృషి చేసి, అధికారులను ఆదేశించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులే కీలక పాత్ర పోషించాలన్నారు. ఉత్సవ విగ్రహాల్లా ఉంటే కాదని, ప్రజాసమస్యల పరిష్కారానికి పరితపిస్తూ గ్రామ సమగ్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన కొత్త సిబ్బందితో సీఈవో సమావేశమై, పలు సూచనలు చేశారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ సమష్టిగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పాల్గొని, పలు సూచనలు చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి..

రామభద్రపురం: గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఈవోపీఆర్‌డీ వెంకటరమణ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణా తరగతులకు హాజరైన ఆయన.. పంచాయతీ విధులు, అధికారాలు, బాధ్యతలు, నిర్వహణ, గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం, పాత్ర వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతుల్లో నేర్పే ప్రతీ అంశాన్ని చక్కగా నేర్చుకుని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మలకొలువు



బొమ్మలకొలువు వద్ద బాబా భక్తులు

బొబ్బిలి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న షిర్డీసాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంటోంది. వివిధ దేవతామూర్తుల విగ్రహాలతో పాటు అందులో విశేష పూజలందుకుంటున్న దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడుతున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌లతో మహిళలు

రాజాం సిటీ: హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో వైరస్) బాధితులపై వివక్ష చూపరాదని ఎస్‌ఏస్పీ, సీఎస్‌సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నేతల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని దోసరి గ్రామంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఉన్న వారిని కూడా మామూలు మనుషుల లాగే చూడాలని, వారిపై చిన్నచూపు చూడడం తగదన్నారు. కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, బి.అనూరాధ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టాటా మృతి పట్ల పలువురి సంతాపం



టాటా మృతికి నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న మెప్మా సిబ్బంది, తదితరులు

బొబ్బిలి: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ నవల్ టాటా మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన తన వ్యాపార సామ్రాజ్య విస్తరణ కన్నా సామాజిక సేవా కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు కొనియాడారు. స్థానిక పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో గురువారం జరిగిన మెప్మా మహాజన సభలో టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి, టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆ తర్వాత టాటా దేశ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో టాటా ప్రథమ వరుసలో ఉంటారన్నారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, రమాదేవి, సిరిపురపు వేణు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించేందుకే గ్రామసభలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నక్క వర్షిణి

రాజాం: ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకే గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేతనదారులు, రైతులంతా కలిసి ఎక్కడ పనులు చేపడితే సాగుకు ఉపయోగకరంగా ఉంటాయో చర్చించుకుని, పనుల ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. అనంతరం ఏపీవో సాయిరాం పలువురు వద్ద నుంచి పనులకు సంబంధించి, దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్క తవిటమ్మ, నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



చిన్నారి బరువును పరిశీలిస్తున్న దృశ్యం

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని బూరాడ, తాటిపాడు, లక్ష్మణవలస తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. చిన్నారుల వయసుకు తగ్గ బరువు, పెరుగుదలను రికార్డులు చూసి, పరిశీలించారు. ప్రతీ చిన్నారికి పౌష్టికాహారం అందేలా చూడాలని, ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



తెర్లాం: అరసబలగలో దుర్గాదేవి మండపం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి ఉమాసోమేశ్వరాలయంలో పూజలందుకుంటున్న ఉమాదేవి అమ్మవారు



రేగిడి: లక్ష్మీపురంలో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ



సంతకవిటి: రంగారాయపురంలో భక్తుల కుంకుమపూజలు



తెర్లాం: నందబలగలో పూజలందుకుంటున్న అమ్మవారు



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో దుర్గమ్మ సన్నిధిలో భక్తుల పూజలు



రాజాం: గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



రాజాం సిటీ అమ్మవారి ప్రతిమ ఆకారంలో దీపాలంకరణ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గమ్మను చూసి తరించేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతున్నారు. గురువారం కనకదుర్గమ్మ అలంకరణలో కనిపించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. పలుచోట్ల చేపడుతున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.
–బొబ్బిలి, రాజాం

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ డీజీఎం కేన్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో జీవామృతం తయారీపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. చెరకు పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు జీవామృతం పిచికారీ చేస్తే పంట బాగుంటుందని, అధిక దిగుబడులు వస్తాయని డీజీఎం తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు రావాలంటే నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు. అనంతరం చెరకు సాగులో సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడులకు పాటించాల్సిన సాగు మెలకువలను వివరించారు.